



	ఇఫ్తార్	సెహరి
	బుధవారం	గురువారం
కర్నూలు	6: 31	5:11
నంద్యాల	6: 28	5:11



ధ్రువీకరణ పత్రాల్లో జాప్యం తగదు: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జనన-మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలోగా అందజేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జనన-మరణాల ధ్రువీకరణ పత్రాల జారీపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన 21రోజుల వ్యవధిలోపు ప్రసవం అయిన ఆస్పత్రిలోనే వైద్యాధికారి నుంచి పుట్టినతేది ధ్రువీకరణ పత్రాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలతో హోం డెలివరీలు, రిజిస్ట్రేషన్ నమోదులపై సమగ్ర సర్వే చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డీపీవో షేక్ జమీవుల్లా, గణాంక అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుల నష్టంపై ప్రభుత్వానికి నివేదిక


కర్నూలు మార్కెట్ యార్డులో కందులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కంది పంట నష్టంపై నివేదికలు అందజేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను కర్నూలు, నంద్యాల కలెక్టర్లు రంజిత్ బాషా, రాజకుమారిలు ఆదేశించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో కందిరైతుల కష్టాలపై ప్రచురితమైన కథనాలకు కలెక్టర్లు స్పందించారు. కంది రైతులకు జరుగుతున్న నష్టంపై నివేదికలు అందజేయాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు, హరినాథ్ రెడ్డిలను ఆదేశించారు. ఇదిలా ఉండగా కందుల కొనుగోలులో రాష్ట్రంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో ఇప్పటిదాకా 2,953 మంది రైతుల నుంచి 3,996 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశామని, వీరికి రూ.30.13 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.29.53 కోట్లును రైతులకు చెల్లించినట్లు కర్నూలు మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 2,400 మెట్రిక్ టన్నులను కందులను 1,756 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని రూ.19 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే 18.50 కోట్లు చెల్లించడం జరిగిందని నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథ్ రెడ్డి తెలిపారు.


శ్రీశైలం జలాశయంలో 847.20 అడుగులకు చేరిన నీటి నిల్వలు

ఉన్న నీరు ఇదే..!

- కర్నూలు జిల్లా రిజర్వాయర్లలో 5.512 టీఎంసీలు
- నంద్యాల జిల్లాలో 17.54 టీఎంసీలు
- వేసవి గండం గట్టెక్కేనా..!?
- రబీ పంటలకూ నీరివ్వాలి...
- జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు
- రేపు నీటి వనరులపై కలెక్టర్ రంజిత్‌బాషా సమీక్ష

గతేడాదితో పోలిస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎండలు తీవ్రత మధ్యనే రబీ పంటలకు ఈ నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. అంతర్రాష్ట్ర జలాశయాలైన శ్రీశైలం, తుంగభద్ర మినహాయిస్తే.. కర్నూలు జిల్లాలో ఐదు రిజర్వాయర్లలో 5.152 టీఎంసీలు, నంద్యాల జిల్లాలో ఆరు జలాశయాలలో 17.54 టీఎంసీల నీరు ఉంది. వివిధ కాలువల పరిధిలో రబీ పంటలు చేతికి రావాలంటే నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా.. నీటి వృథాను అరికడితే వేసవి నీటిఎద్దడి తలెత్తకుండా ప్రజల దాహం తీర్చవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. నీటి నిల్వలపై కలెక్టర్ పి. రంజిత్‌బాషా గురువారం జలవనరుల శాఖ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్, టీబీపీ ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు, ఎస్సార్బీసీ, ఎస్టీఆర్ తెలుగుగంగ కాలువ పరిధిలో దాదాపుగా 3.36 లక్షల ఎకరాల్లో రబీ ఆయకట్టు సాగులో ఉంది. హంద్రీ నీవా కాలువ కింద రైతులు మరో 17 వేలు సాగు చేశారు. వివిధ దశల్లో ఉన్న రబీ పంటలు చేతికి రావాలంటే ఈ నెలాఖరు వరకు నీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కర్నూలు జిల్లాల్లో గాజులదిన్నె, సుంకేసుల, కృష్ణగిరి, పత్తికొండ, పులికనుమ జలాశయాల్లో 5.152 టీఎంసీలు, నంద్యాల జిల్లాలో వెలుగోడు, గోరుకల్లు, అవుకు, జుర్రేరు, వరద రాజుస్వామి గుడి, అలగనూరు జలాశయాల్లో 17.54 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది మే వరకు ఎండల తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండడంతో వేసవి నీటి ఎద్దడి నుంచి గట్టెక్కే అవకాశం ఉన్నా.. నీటి వృథాను అరికట్టడంతో పాటు నీటి పొదుపు పాటించకపోతే ఇబ్బందులు తప్పవని సాగునీటి నిపుణులు హెచ్చరిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదని, ఇప్పటి నుంచి నీటి వినియోగంపై పక్కా ప్రణాళికలు రూపొందించాలని పలువురు సూచిస్తున్నారు.

మిగతా 7వ పేజీలో

శ్రీశైలంలో 74.45 టీఎంసీలు నీటి నిల్వలు

శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 74.15 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 215.8 టీఎంసీలకు గాను.. 847.20 అడుగుల్లో 74.15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇటీవల జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో శ్రీశైలం నుంచి ఏపీ నీటి వినియోగం ఆపేయాలని సూచించడంతో ప్రస్తుతం మాల్యాల పంప్‌హౌస్ నుంచి కేసీ కాలువకు 675 క్యూసెక్కులు, హంద్రీనీవా కాలువకు 674 క్యూసెక్కులు మాత్రమే తీసుకుంటున్నారు. ఏ క్షణమైనా ఎత్తిపోతలు ఆపేయవచ్చని అంటున్నారు. అదే జరిగితే సాగులో ఉన్న పంటల దిగుబడి ప్రశ్నార్థకంగా మారుతుంది. కేసీ కింద 92 వేల ఎకరాలు సాగులో ఉంది. ఎస్సార్బీసీ పరిధిలో 98 వేల ఎకరాలు, తెలుగుగంగ కాలువ పరిధిలో 1.14 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయని ఇంజనీర్లే అంటున్నారు. గోరుకల్లు, వెలుగోడు, అవుకు జలాశయాల్లో 17.281 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయి. పక్కా ప్రణాళికతో వినియోగిస్తే వేసవిలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

నమో.. నారసింహా...

- అహోబిలంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- దిగువ అహోబిలంలో సెల్వార్ కూత్తు ఉత్సవం



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 4(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న అహోబిలంలో లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి వైభవంగా అంకురార్పణ చేశారు. ఆహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ జ్వాలా నరసింహస్వామిని దర్శించుకుని మంగళ శాసనం చేశారు. అనంతరం పీఠాధిపతి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఎగువ అహోబిలంలో నారసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగాలని జ్వాలా నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు పర్యవేక్షకుడిగా వ్యవహరించే విష్వక్సేనుడికి తలపాగా చుట్టి పూలమాలలు వేసి పల్లకిలో కొలువుదీర్చి ఆలయం వెలుపలికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపు ఉన్న పుట్టకు పూజలు నిర్వహించి పుట్ట మన్నును సేకరించి మండపం వద్దకు తీసుకొచ్చారు. అంకుర హోమం నిర్వహించి చంద్రుడిని (సోముడు)మట్టిలోకి ఆవాహనం చేశారు. నవగ్రహాలకు సూచికగా నవధాన్యాలను మట్టిలో పోసి సోమకుంభ స్థాపన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.


ఎగువ అహోబిలం చేరుకుంటున్న 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహదేశికన్

'ఎగువ'లో నేడు ధ్వజారోహణం

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో బుధవారం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. స్వామి అమ్మవార్లకు నిత్యపూజలతోపాటు అభిషేకం, బేరిపూజ నిర్వహిస్తారు. జ్వాలా నరసింహస్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

'దిగువ'లో సెల్వార్ కూత్తు ఉత్సవం

దిగువ అహోబిలంలో మంగళవారం ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా సెల్వార్ కూత్తు ఉత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా దిగువ అహోబిలంలో బుధవారం సాయంత్రం అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ పూజలు నిర్వహించనున్నారు.

వైద్యవృత్తి అత్యున్నతం

- కేఎంసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే
- 250 మంది వైద్యులకు పట్టాలు పంపిణీ



6లో

నీలితొట్లవీధిలో ఆగని అతిసార..!

- మరికొంత మందికి అస్వస్థత
- బాధితులకు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం
- కాలనీల్లో యుద్ధప్రాతిపదికన కొత్త పైపులైన్


ఆత్మకూరు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న బాధితులు

ఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్లవీధిలో కలుషిత నీటి కారణంగా ప్రబలిన అతిసార ఆరు రోజులైనా తగ్గుముఖం పట్టడం లేదు. ఇప్పటికే ముగ్గురు అతిసారతో మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతోపాటు తాజాగా మరికొంత మంది అతిసార లక్షణాలతో బాధపడుతూ ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే కాలనీకి సరఫరా జరిగే తాగునీటిని పరీక్షించిన అధికారులు తొలుత కలుషితం జరగలేదని ప్రాథమికంగా నిర్ధారించినప్పటికీ కర్నూలు రీజనల్ ల్యాబ్‌లో వెల్లడైన నివేదికలో ఓ ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో ప్రాణాంతకమైన ఈ-కోలీ బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. దీంతో నీలితొట్లవీధితో పాటు సమీప కాలనీల ప్రజలు మరింత ఆందోళనకు గురయ్యారు. వైద్యులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా జబ్బుపడిన వారిని ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రానికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నవారిని కర్నూలు జనరల్ ఆసుపత్రికి తరలిస్తున్నారు. కాగా మంగళవారం నాటికి కర్నూలులోని ఆసుపత్రుల్లో నూర్‌అహ్మద్, గాయత్రి, రమిజాబీ, హిమామ్‌బీ, షహనాజ్‌బీ చికిత్స పొందుతుండగా ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలో షాహిదాబీబేగం, సయ్యద్ జిలేకాబీ, ఖాదర్‌వలి, శ్రీనివాసగౌడ్ వైద్యసేవలు పొందుతున్నారు. ఇదిలావుంటే నీలితొట్లవీధిలో అతిసార ప్రబలడంతో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. అలాగే నీలితొట్లవీధితో పాటు సమీప కాలనీలకు పైపులైన్ల ద్వారా నీటిసరఫరా నిలిపి వేసి ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నీలితొట్లవీధిలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి 24గంటల పాటు పర్యవేక్షిస్తున్నారు.

ముగ్గురి మరణాలకు బాధ్యులెవరూ..?

ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్లవీధిలో రహంతుల్లా(50), బషిరూన్‌బీ (60), గొల్లపేటలో రామచంద్రుడునాయక్ (60) తాగునీరు కలుషితం కావడంతో అతిసార ప్రబలి మరణించారని వారి కుటుంబసభ్యులు చెబుతున్నారు. అయితే తొలుత కాలనీలో తాగునీటి కలుషితం జరగలేదని ఏకంగా కలెక్టరే ప్రకటించారు. కానీ ప్రస్తుతం ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో ప్రాణాంతకమైన బ్యాక్టీరియా ఉన్నట్లు తేలడంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఆ ముగ్గురు మరణాలకు బాధ్యులు ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో

కొత్త బిజినెస్.. హోం స్టే

- మంత్రాలయంలో రద్దీ పెరగడంతో లాడ్జీలుగా మారిన ఇళ్లు
- పుట్టగొడుగుల్లా అనుమతి లేని లాడ్జీలు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- నోటీసులే తప్ప.. చర్యలేవీ..?
- అంతా నాయకుల అండదండలతోనే
- పంచాయతీ, కుడా ఆదాయాలకు భారీ గండి

మంత్రాలయం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో మిగతా రోజులకంటే శనివారం, ఆదివారం, గురువారం. ఇతర సెలవు రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. మంత్రాలయం పట్టనంతగా వస్తున్న భక్తులకు వసతి ఇబ్బందిగా మారింది. ప్రైవేటు, రాఘవేంద్రస్వామి మఠం గదులు సరిపోకపోవడం లేదు. రూ.400 ఉండే సాధారణ రూము అద్దె రూ.8వేలకు పెంచేశారు. గంటకు ఓ రేటు నిర్ణయించి ప్రైవేటు లాడ్జీల యజమానులు వసూలు చేస్తున్నారు. డబ్బున్నవారు వేరే వ్యాపారాలు వదిలిపెట్టి లాడ్జీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గత ఏడాది నుంచి 25 లాడ్జీలు నిర్మాణమయ్యాయి.

● మంత్రాలయంలో 10,613 మంది జనాభా ఉండగా.. 3,550 గృహాలు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు లాడ్జీలు 85, మరో 15 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వీటన్నింటిని కలిపినా ప్రైవేలుగా 500 గదులు, రాఘవేంద్రస్వామి మఠానికి చెందినవి దాదాపు 1500 గదులు ఉన్నాయి. రద్దీ సమయాల్లో ఈ గదులు ఏ మాత్రం సరిపోవడం లేదు. మంత్రాలయంలో దాదాపు 10వేల మందికి వసతి కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయి. అయితే 50వేల మందికి పైగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో లాడ్జీలకు డిమాండ్ పెరిగింది.



నాగలదిన్నె రోడ్డులో హోంస్టేగా మారిన ఇల్లు


ఇంటిని లాడ్జీగా మార్చి నిర్మాణం చేస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని ఇళ్లను కూడా లాడ్జీలుగా మార్చేస్తున్నారు. కొత్తగా హోం స్టే అనే మాట విరివిగా ప్రచారంలోకి వచ్చింది. దీని కోసం పదేళ్ల నుంచి అద్దెకు ఉంటున్న వాళ్లను యజమానులు నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. రోజువారీ అద్దె ప్రకారం భక్తుల నుంచి వసూలు చేస్తున్నారు. అద్దె ఇళ్లు కరువై స్థానికంగా పని చేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు ఇతర గ్రామాల నుంచి మంత్రాలయం వస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల తాకిడికి మంత్రాలయానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న పొలాల్లో సైతం లాడ్జీలను నిర్మిస్తున్నారు. గ్రామ పంచాయతీ, కుడా అనుమతులు కూడా తీసుకోకుండా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకుల అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందనే విమర్శలు ఉన్నాయి.

పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్న లాడ్జిలు, హోం స్టేలు

మంత్రాలయంలో కుడా, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా లాడ్జీలు హోం స్టేలు పుట్టగొడుగుల్లా పుట్టుకవస్తున్నాయి. రామచంద్రనగర్, రాఘవేంద్రపురం, సంత మార్కెట్, నాగలదిన్నె రోడ్డు, సుజీయాంద్రనగర్, ఓల్డ్ టౌన్‌లో బాడుగలకు ఉన్న వారిని ఇండ్ల నుంచి బైటికి పంపి, ఆ ఇండ్లను ప్రభుత్వ అనుమతులు లేకుండా హోంస్టేలుగా మార్చేసి బాడుగలకు ఇస్తున్నారు. ఇంట్లో మూడు గదులు ఉంటే.. రోజుకు 5వేల దాకా సంపాదిస్తున్నారు. దీనికి పంచాయతీ అనుమతులు లేవు. విద్యుత్, అగ్నిమాపక శాఖ, కాలుష్యం, పార్కింగ్ స్థలాలు లేకుండానే నడుపుతున్నారు. కొత్త కాలనీలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కాలనీ మధ్యలో ఇండ్ల యజమానులు యథేచ్ఛగా గదులను హోం స్టేగా అద్దెకు ఇస్తున్నారు. దీని వల్ల చుట్టుపక్కల ఉన్న వాళ్లు ఇబ్బందిపడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

ఆదుకున్న ఆర్గానిక్

- మందులు లేని పంటల సాగుతో అద్భుత ఫలితాలు
- యూఎస్‌ఏ, దుబాయ్‌కి దిగుబడుల ఎగుమతి
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు నరసింహులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని వెంకటగిరిలో రైతు నరసింహులు ఆర్గానిక్ పంటలను సాగు చేస్తూ లాభాల బాటలో నడుస్తున్నాడు. ఈయన పండించిన పంటలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామానికి చెందిన రైతు నరసింహులు వ్యవసాయంలో అందరి రైతుల మాదిరిగానే ప్రతియేట మిరప, పత్తి, బొబ్బాయి వంటి పంటలను సాగు చేస్తున్నాడు. అయితే పంటలకు పురుగు మందులతోపాటు కూలీల ఖర్చు అధికమైంది. అంతేగాక మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు ధర కూడా లభించడం లేదు. దీంతో నష్టాల పాలవుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆర్గానిక్ వ్యవసాయం వైపు మళ్లాడు. అనుకున్నదే తడువుగా వెంకటగిరి గ్రామంలో తనకున్న భూమిలో ఆర్గానిక్ పంటలను సాగు చేయడం మొదలు పెట్టాడు. ఎకరన్నర పొలంలో రూ.60 వేలు ఖర్చు పెట్టి ఆర్గానిక్ పద్ధతిలో మిరప పంటను సాగు చేశాడు. దీంతో 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇతరుల సహకారంతో తాను పండించిన పంటను యూఎస్‌ఏకు క్వింటం ధర రూ.28 వేల ప్రకారం ఒప్పదం కుదుర్చుకొని ఎగుమతి చేసి దాదాపు రూ.5 లక్షల వరకు ఆదాయం పొందాడు.



వెంకటగిరి టు.. దుబాయ్

రైతు నరసింహులు ఈ ఏడాది సైతం ఆర్గానిక్ పద్ధతిలో తనకున్న రెండు ఎకరాల్లో దాదాపు రూ.లక్ష ఖర్చు పెట్టి బొప్పాయి సాగు చేశాడు. బెంగళూరులో తనకు తెలిసిన ఓ ఏజెంట్ ద్వారా దుబాయ్ వాళ్లతో ఒప్పందం కుదుర్చుకొని మొదటి కోతలో కేజీ బొప్పాయి ధర రూ.22 ప్రకారం విక్రయిస్తూ మంచి లాభాలను పొందుతున్నాడు. అంతేగాక హార్టికల్చర్ అధికారుల సహకారంతో ఎప్పటికప్పుడు పంటల సాగులో మెలకువలు తెలుసుకొని ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



పంట దిగుబడిని వెంకటగిరి నుండి దుబాయ్‌కు సరఫరా చేస్తున్న దృశ్యం

ఓ దశలో వ్యవసాయాన్ని వదిలేసుకుందామనుకున్న



ప్రతియేటా మిరప, పత్తి, బొప్పాయి పంటలను సాగు చేస్తూ వచ్చేవాడిని. రసాయన మందులను అధికంగా పిచికారి చేయడం, పిచికారి చేసినా పంటలకు సోకిన వైరస్‌లు తగ్గక పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేవి కాదు. విసిగిపోయి ఆర్గానిక్ పంటలను సాగు చేయడం మొదలు పెట్టాను. ఆర్గానిక్ వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉండడమేగాక లాభాలు కూడా బాగానే కనిపించాయి. దీంతో ఆర్గానిక్ పంటలను సాగు చేస్తూ వస్తున్నా.

నరసింహులు, రైతు

ఆర్గానిక్ వ్యవసాయం చేస్తే రైతులకు మంచి లాభాలు



ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయి. రసాయన ఎరువులతో పండించిన పంటలకు ధర తక్కువగా ఉంటుంది. అలాగే భూసారం కూడా తగ్గి పంటల దిగుబడి తగ్గుతుంది. రైతులు తప్పకుండా ఆర్గానిక్ వ్యవసాయం చేసి లాభాల బాటలో పయనించాలి.

-శ్రీవాణి, హార్టికల్చర్ అధికారి

రసాయన, ఆర్గానిక్ ధరల వ్యత్యాసం

రసాయనిక మందులను వాడుతూ సాగు చేసే మిరప పంట రకాన్ని బట్టి క్వింటం రూ.6 వేల నుంచి రూ. 15 వేలు పలుకుతోంది. అంతేగాక పిచికారి మందులను వాడి పండించిన పంటకు మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉంటుంది. అలాగే పెట్టుబడి ఖర్చులు, పంటకు తెగుళ్లు సైతం ఎక్కుకుగా సోకుతాయి. కొన్ని సార్లు ముడత ప్రభావం, మొక్కలు ఎండిపోవడంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బొప్పాయి పంటలో సైతం రసాయన మందుల వాడకంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతాయి. రసాయన మందులతో పండించిన బొప్పాయి పంటను కిలో రూ.15 నుంచి రూ.17 వరకు కొనుగోలు చేస్తారు. అదే ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసే బొప్పాయి దిగుబడి ఎక్కువ రావడమేగాక కిలో రూ.25 నుంచి రూ.28 వరకు కొనుగోలు చేస్తారు. రవాణా ఖర్చులు సైతం దిగుమతి చేసుకునే వారే భరిస్తారు.



ఆర్గానిక్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ, హార్టికల్చర్ అధికారులు

తుంగాతీరం.. జనసంద్రం

- ఘనంగా కొనసాగుతున్న గురు వైభవోత్సవాలు
- రాఘవరాయడికి విశేష పంచామృతాభిషేకం



భజన మండళ్లను ఉద్దేశించి మట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం తుంగాతీరాన ఉన్న శ్రీమఠం వేలాది మంది భక్తులతో జనసంద్రంగా మారింది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రులకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రాఘవరాయలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్తవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, బంగారు రథాలపై ఘనంగా ఊరేగించారు. పరిమళ న్యాయ సుధ పరీక్షలను యాగశాలలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వ్యాసరాజమఠం స్వామీజీ విద్య విజయతీర్థులు పండిత కేసరి, రాష్ట్రపతి అవార్డు గ్రహిత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వేద పండితుల మధ్య ఇష్టాగోష్టి నిర్వహించారు. ఇందులో పరిమళ న్యాయసుధ గ్రంథం పూర్తి చేసుకున్న ఇద్దరు విద్యార్థులు పీఎస్ రాఘవేంద్ర, వాది సింహ ఉత్తీర్ణత సాధించారు. వైభవోత్సవాలకు ముఖ్యఅతిథులుగా వచ్చిన వ్యాసరాజ మఠం స్వామీజీ విద్య విజయతీర్థులకు శ్రీమఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. రాత్రి బెంగుళూరు చెందిన బృందావన్ కళానికేతన్ నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది.

ప్రముఖులకు అవార్డులు ప్రదానం: గురు వైభవోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాలలో బళ్లారి ఎంపీ తుకారాం, బెంగుళూరు చెందిన విద్వాన్ కేశవాచార్యులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వ్యాసరాజ మఠం స్వామీజీ విద్య విజయతీర్థులు అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్వాన్, రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవి కులకర్ణి, వ్యాసరాజాచార్, వాధిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, జేసీ స్వామి, డీఎం ఆనందరావు, వేణుగోపాలాచార్, రమేషాచార్, కడప రాఘవేంద్రాచార్, హనుమేషాచార్ తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి ఎంపీ తుకారాంకు అవార్డును ప్రదానం చేస్తున్న వ్యాజరాజ మఠం స్వామీజీ విద్యావిజయతీర్థులు

రేనాటి అమ్మ బిడ్డ

- ఎస్‌ఐగా ఎంపికై తల్లికి సెల్యూట్
- వ్యవసాయ కుటుంబం నుంచి ఎదిగిన శివనాగిరెడ్డి



ఎస్‌ఐగా ఎంపికైన శివనాగిరెడ్డితో తల్లిదండ్రులు

రుద్రవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రమ ఆయుధం అయితే.. విజయం బానిస అవుతుందన్న మాటలను నిజం చేసి చూపించాడు రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన రేనాటి శివనాగిరెడ్డి. ఎస్‌ఐ కావాలన్న లక్ష్యంతో పట్టుదలతో చదివి ఉద్యోగాన్ని సాధించిన ఆయన కడప జిల్లాలో పోస్టింగ్ సాధించి సొంతూరుకు చేరుకున్నారు. గ్రామస్థులతో పాటు స్నేహితులు మంగళవారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. పోలీస్ యూనిఫాంలో వచ్చిన శివనాగిరెడ్డి ముందుగా తల్లి లక్ష్మిదేవికి సెల్యూట్ చేసి పాదాభివందనం చేశారు. తండ్రి రేనాటి అంకిరెడ్డిని హత్తుకుని విజయానందాన్ని పంచుకున్నారు. ఈ సన్నివేశాన్ని చూసిన గ్రామస్థులు ఉద్వేగానికి లోనై శివనాగిరెడ్డిని అభినందించారు. శివనాగిరెడ్డి 2024లో ఎస్‌ఐగా ఎంపికై అనంత పురంలోని పీటీసీలో శిక్షణ పొందారు. ప్రభుత్వం మొదటి పోస్టింగ్ కడప జిల్లాలో ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన ఆయన దాదాపు ఐదేళ్ల పాటు పట్టుదలతో చదివి ఎస్‌ఐ కొలువు సాధించారు.



ఎస్‌ఐగా ఎంపికై తల్లి లక్ష్మీదేవికి వందనం చేస్తున్న కొడుకు

మా తల్లిదండ్రుల కల



మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మానాన్నలు నన్ను పోలీస్ యూనిఫాం దుస్తుల్లో చూడాలని చిన్నప్పటి నుంచి కోరిక ఉండేది. వాళ్ల కలను ఎలాగైనా సాకారం చేయాలని అనుకున్నా. వేరే వ్యాపకాలు ఏవీ పెట్టుకోకుండా కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించా. ఇప్పుడు కుటుంబం అంతా సంతోషంగా ఉంది. మొదటి పోస్టింగ్ కడప జిల్లాలో ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

- రేనాటి శివనాగిరెడ్డి, ఎస్‌ఐ

కొత్త బిజినెస్.. హోం స్టే



టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న రామచంద్రనగర్ కాలనీవాసులు

(5వ పేజీ తరువాయి)

మంత్రాలయంలో పలు కాలనీల్లో బాడుగలకు ఉన్న వారిని ఖాళీ చేయించి భక్తులకు రోజువారి బాడుగలకు గదులు ఇవ్వడం పట్ల ఆగ్రహించిన మహిళలు తహసీల్దార్ ఎస్.రవికి, పోలీసులకు, టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి, పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవికి గతంలో ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు.

అనుమతులు లేని లాడ్జీలే ఎక్కువ

మంత్రాలయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలం, ఫైర్, కాలుష్యం, వెలుతురు, నీరు వంటి సదుపాయాలు ఉంటేనే లాడ్జీలకు అనుమతులు ఇవ్వాలి. కానీ ఇలాంటి అనుమతులు లేకుండా, ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది.. ఆ ఇంట్లోనే గ్రౌండ్ ఫ్లోర్, జీ+2లకు అనుమతులు పొంది.. 3, 4, 5 అంతస్థుల వరకు నిర్మించుకుంటున్నారు. ఇలాంటి నిర్మాణాలకు పాల్పడిన 18 మందికి పంచాయితీ వారు నోటీసులు జారీ చేశారు.

లాడ్జీల వాహనాలన్నీ రోడ్డుపైనే.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు

మంత్రాలయంలో ప్రైవేటు లాడ్జీలకు పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో మంత్రాలయం రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసి గదులు అద్దెకు తీసుకుంటున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతోనే ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

శ్రీమఠం గదులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు

రాఘవేంద్రస్వామి మఠం తరపున గదులు తీసుకున్న వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. మరో 15 ఎకరాల్లో ఎంపీడీవో కార్యాలయం వద్ద కారు పార్కింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. శ్రీమఠం తరపున పార్కింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినా ప్రైవేటు లాడ్జీల యజమానుల వల్లనే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. గత రెండు నెలల నుంచి తాత్కాలిక షెడ్లలో గదులను సుందరంగా తీర్చిదిద్ది, డబ్బు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మంత్రాలయం లాడ్జీలు, హోంస్టేలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మించుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం



మంత్రాలయంలో గత ఆరు నెలల నుంచి అక్రమంగా నిర్మిస్తున్న లాడ్జీలు, హోంస్టేలుగా మారిన ఇండ్ల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. అనుమతులు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు.

- తెల్లబండ్ల భీమయ్య, సర్పంచ్, మంత్రాలయం

మా కాలనీలో ఎవరు వచ్చి వెళ్తున్నారో తెలియడం లేదు



రామచంద్రనగర్‌లో మా ఇల్లు ఉంది. గత ఐదు నెలల నుంచి మా పక్కింటి వారు అద్దెకు ఉంటున్నవారిని ఖాళీ చేయించి భక్తులకు హోంస్టేగా గదులు అద్దెకు ఇస్తున్నారు. ఎవరి వచ్చి వెళ్తున్నారో.. ఏం పనులు మీద వస్తున్నారో, అక్కడేం జరుగుతోందో మాకు తెలియడం లేదు.

- బొంబాయి ఈరన్న, రామచంద్రనగర్ కాలనీ, మంత్రాలయం:

హోంస్టేల పేరుతో భక్తులకు గదులు ఇస్తున్నారు



హోంస్టేల పేరుతో మా పక్కింటి వారు భక్తులకు గదులు ఇస్తున్నారు.. వారు భక్తులో, ప్రేమికులో, దొంగలో మాకు తెలియడం లేదు. వారి నుంచి మాకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఇట్లా ఇళ్లను రోజువారీ అద్దెకు ఇవ్వడం సరికాదు.

- లత గృహిణి, మంత్రాలయం

అనుమతులు తీసుకోకపోతే.. పంచాయతీ ఆదాయానికి గండి



ఇండ్లనే లాడ్జీలుగా, హోంస్టేలుగా మారిస్తే పంచాయతీ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతులు పొందాలి. అలా అనుమతులు తీసుకోకుంటే పంచాయతీ ఆదాయానికి గండి కొట్టి కాలనీవాసులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. వెంటనే నోటీసులు ఇచ్చి లాడ్జీలను, హోంస్టేలను తొలగిస్తాం

- ప్రభావతిదేవి, ఈవోఆర్‌డీ మంత్రాలయం

వైద్యవృత్తి అత్యున్నతం

- కేఎంసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే
- 250 మంది వైద్యులకు పట్టాల పంపిణీ





తల్లిదండ్రులతో హాజరైన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి ఎంతో ఉన్నతమైందని అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ అన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో 2019 బ్యాచ్ వైద్యవిద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అకడమిక్ డీఎంఈ జి.రఘునందన్, రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల విద్య తర్వాత వైద్య వృత్తిలో అడుగుపెడుతున్న వైద్యులకు అభినందనలు తెలిపారు. వైద్యులుగా రాణించాలని, వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యవృత్తిలో విలువలు అత్యంత అవసరమని, విలువలతో కూడిన వైద్యాన్ని రోగులకు అందించాలన్నారు. ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ కొత్తగా వైద్యవృత్తిలో అడుగుపెడుతున్న వైద్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులకు ఎంబీబీఎస్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ సాయిసుధీర్, హరిచరణ్, ఏ.రేణుకాదేవి, బి.విజయానందబాబు తదితరులు పాల్గొన్నారు.



అకడమిక్ డీఎంఈ జి.రఘునందన్‌ను సత్కరిస్తున్న దృశ్యం



గోల్డ్ మెడల్ పొందిన వైద్యులు వీరే...

అనాటమి విభాగం : టి.హర్షిత
ఫిజియాలజి విభాగం : ధనారెడ్డి, లక్ష్మి, నరహరి రెడ్డి
బయోకెమిస్ట్రీ విభాగం : టి.హర్షిత, జీజీ మానస
ఫార్మకాలజి విభాగం : నవలూరి శ్రీనాగ ఈశ్వరి
పెథాలజి విభాగం : జీజీ మానస
మైక్రోబయాలజీ విభాగం : నాగలూరి శ్రీనాగ ఈశ్వర్
ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం : ధనిరెడ్డి, లక్ష్మి నరహరి రెడ్డి
ఈఎన్‌టీ అండ్ ఆప్తమాలజి విభాగం : కంచి జయశ్రీ, వైష్ణవి వర్మ
కమ్యూనిటీ మెడిసిన్ విభాగం : మద్దిపట్ల మనోజ్ నాయుడు
పీడియాట్రిక్ అండ్ గైనిక్, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలపి విభాగం : నాగలూరి శ్రీనాగ ఈశ్వర్
సర్జరీ విభాగం : ధనలక్ష్మి, లక్ష్మినరహరి రెడ్డి

ఉన్న నీరు ఇదే..!



గాజులదిన్నె జలాశయంలో ఉన్న నీటి నిల్వలు 2.57 టీఎంసీలు

(5వ పేజీ తరువాయి)

గాజులదిన్నె ఆధారం..

కర్నూలు జిల్లాలో కర్నూలు నగరం సహా వివిధ గ్రామాలు, నంద్యాల జిల్లాలో డోన్ పట్టణాలకు వేసవి దాహం తీర్చే ప్రాణనాడి గాజులదిన్నె జలాశయం. గత ఏడాది అడుగంటిపోయింది. ఈ ఏడాది టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, ఇంజనీర్లు ముందస్తు ప్రణాళికతో హంద్రీనీవా కాలువ, టీబీపీ ఎల్లెల్సీ నుంచి నీటిని తీసుకొని గాజులదిన్నె ప్రాజెక్టులో నిల్వ చేశారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 377 మీటర్లు, పూర్తిస్థాయి సామర్థ్యం 4.5 టీఎంసీలకు కాగా.. 374.89 మీటర్లలో 2.57 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. అందులో లైవ్ కెపాసిటీ 1.92 టీఎంసీలు. కుడి ఎడమ కాలువల కింద 12,300 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఈ పంటలు చేతికి రావాలంటే 0.90 టీఎంసీలు అవసరమని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. మిగిలిని ఒక టీఎంసీ నీటితో వేసవిలో పుష్కలంగా తాగునీరు ఇవ్వవచ్చని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. అయితే.. నీళ్లు ఉన్నాయి కదా అని విచ్చలవిడిగా వాడేస్తే ఇబ్బందులు తప్పవంటున్నారు. హంద్రీనీవా పరిధిలో కృష్ణగిరి రిజర్వాయర్‌లో 0.161 టీఎంసీలు, పత్తికొండ జలాశ యంలో 0.75 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పులికనుమ జలాశయంలో 0.79టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి.

కర్నూలు జిల్లాలో నీటి నిల్వలు (టీఎంసీలు)		
జలాశయం	గరిష్ఠం	ప్రస్తుతం
గాజులదిన్నె	4.5	2.57
సుంకేసుల	1.20	0.881
క్రిష్ణగిరి	0.164	0.161
పత్తికొండ	1.126	0.75
పులికనుమ	1.243	0.79
మొత్తం	**8.533**	**5.152**

నంద్యాల జిల్లాలో నీటి నిల్వలు (టీఎంసీలు)		
జలాశయం	గరిష్ఠం	ప్రస్తుతం
వెలుగోడు	16.95	6.536
గోరుకల్లు	12.5	8.92
అవుకు	4.14	1.895
జుర్రేరు	0.266	0.12
వరదరాజస్వామి	0.389	0.148
అలగనూరు	2.965	--
మొత్తం	**37.213**	**17.549**

అంతర్‌రాష్ట్ర జలాశయాల్లో నీటి నిల్వలు (టీఎంసీలు)		
శ్రీశైలం	215.80	75.47
తుంగభద్ర	105.78	32.49

తుంగభద్రలో 5.61 టీఎంసీలు నీటి వాటా..

రాయలసీమకు జీవనాధారమైన తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం ఆశాజనకంగా నీటి నిల్వలు ఉన్నాయి. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 105.78 టీఎంసీలుగాను.. 1606.14 అడుగుల వద్ద 30.57 టీఎంసీలు నిల్వ ఉంది. ఈ ఏడాది 198 టీఎంసీలకు లెక్క గట్టి కేసీ నీటి వాటా 10 టీఎంసీలకు గాను 9.34 టీఎంసీలు కేటాయించారు. అందులో 3.50 టీఎంసీలు హెచ్చెల్సీ కాలువ ద్వారా అనంతపురం జిల్లాకు మళ్లించారు. ఇప్పటికే 4.23 టీఎంసీలు కేసీసీ వాటాగా వాడుకున్నారు. మిగిలిన 1.61 టీఎంసీలు విడుదల చేయాలని ఇండెంట్ ఇచ్చారు. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) నీటి వాటా 24 టీఎంసీలు కాగా 2024-25 నీటి సంవత్సరంలో 22.53 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికే 17.53 టీఎంసీలు వినియోగించుకోగా.. 5 టీఎంసీలు మిగులు వాటా ఉందని ఇంజనీర్లు తెలిపారు. సాగులో ఉన్న 45 వేల ఎకరాలకు 4 టీఎంసీలు ఇచ్చినా.. వేసవి తాగునీటి అవసరాలకు ఒక టీఎంసీ నీరు ఉంటుందని అంటున్నారు. సుంకేసులలో ప్రస్తుతం 0.881 టీఎంసీలు ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి 153 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని ఇంజనీర్లు తెలిపారు. మార్చి 31 నాటికి కనిష్ఠంగా 0.60 టీఎంసీలు నిల్వ ఉంచినా కర్నూలు నగర ప్రజలకు వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా తాగునీరు ఇవ్వవచ్చని ఇంజనీర్లు తెలిపారు.

6న నీటి నిల్వలపై కలెక్టర్ సమీక్ష

రబీలో పంటల అవసరం, వేసవిలో తాగునీటి సరఫరా, ప్రస్తుతం ఆయా జలాశ యాల్లో ఉన్న నీటి నిల్వలపై సమీక్షించేందుకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం జలవన రుల శాఖ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జలాశయాల వారిగా పూర్తి వివరాలతో రావాలని ఇంజనీర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే.. ఈ సమావేశానికి గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్లను కూడా పిలిస్తే.. రెండు శాఖల ఇంజనీర్ల మధ్య సమన్వయం ఏర్పడుతుందని, ఎల్లెల్సీ పరిధిలో ఎస్‌ఎస్ ట్యాంకులలో నీటిని నింపేందుకు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో కమిటీ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

బళ్లారి చౌరస్తాలో రోడ్డు ప్రమాదం

- హాస్టల్ వార్డెన్ దుర్మరణం



కృష్ణారెడ్డి(ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం పలువురిని కలిచివేసింది. ఒక ఆటో డ్రైవర్ తప్పిదం.. లారీ డ్రైవర్ అతివేగం, మోటారు సైకిలిస్టు అజాగ్రత్త కారణంగా ఓ రిటైర్డ్ వార్డెన్ దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసు కుంది. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామా నికి చెందిన కృష్ణారెడ్డి(67) లద్దగిరి బీసీ హాస్టల్‌లో 16 ఏళ్ల వార్డెన్‌గా విధులు నిర్వర్తించాడు. రిటైర్మెంట్ అయి కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ వెనుక వైపు ఉన్న పంచరత్న కాంప్లెక్స్ వీధిలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య విజయలక్ష్మి, ఒక కొడుకు, ఒక కూతురు సంతానం. రెండు నెలల క్రితం భార్య కూడా మృతి చెందింది. కృష్ణారెడ్డి ప్రతిరోజు దుర్గా హోటల్ వద్దకు వచ్చి అక్కడ బైక్‌ను పార్కింగ్ చేసి వాకింగ్ వెళ్తుంటాడు. రోజు మాదిరిగానే మంగళవారం కూడా తన స్కూటర్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. హైదరాబాదు వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్ పక్కన డీమార్టు వద్దకు వచ్చేసరికి ఒక లారీని ఓవర్‌టేక్ చేయబోయాడు. ఓవర్‌టెక్ చేస్తుండగా.. ఎదురుగా ఓ ఆటో రాంగ్ రూట్‌లో వచ్చింది. ఆటో డ్రైవర్ కూడా కాస్త అజాగ్రత్తగా ఉండటంతో కృష్ణారెడ్డి తన బైకును ఎడమవైపునకు తీసుకున్నాడు. అప్పటికే వేగంగా వెళ్తున్న లారీ కృష్ణారెడ్డిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడ్డ కృష్ణారెడ్డిపైన లారీ టైర్లు వెళ్లాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో టైర్లు కృష్ణారెడ్డి మృతదేహాన్ని కొంత దూరం ఈడ్చుకెళ్లాయి. దీంతో ఆయన మృతదేహం ఛిద్రమైంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. ఆర్టీసీ బస్సు బోల్తా ..

- సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ ..
- 16మందికి గాయాలు .. నలుగురికి తీవ్ర అస్వస్థత ..
- పొలంలో పడటంతో తప్పిన ప్రాణ నష్టం ..
- మెరుగైన చికిత్స అందించాలని మంత్రి బీసీ సూచన






పొలంలో బోల్తాపడ్డ బస్సు, గాయపడ్డ ప్రయాణికుడు

కొలిమిగుండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాల మీదకు తెచ్చింది. మండలంలోని కల్వటాల సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు బోల్తా పడి 16మంది ప్రయాణికులు గాయపడ్డారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె(హైర్) బస్సు (ఏపి 39 యూవీ 4299) జమ్మలమడుగు నుండి తాడిపత్రికి 34మంది ప్రయాణికులతో బయల్దేరింది. డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కల్వటాల సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే 10అడుగుల లోతు ఉన్న వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చెయొద్దని ప్రయాణికులు చెబుతున్నా వినకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కూలీలు, వాహనచోదకులు సహాయక చర్యలు చేపట్టారు. నందిపాడుకు చెందిన సుబ్బలక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ, డ్రైవర్ ఎస్.మహబూబ్ బాషా, నారాయణ తీవ్రంగా గాయపడ్డారు. కల్వటాలకు చెందిన మూగెన్న, కండక్టర్ జీవన్‌కుమార్, రాగిణి, లక్ష్మి, ఆదెమ్మ, కడప జిల్లాకు చెందిన మరికొంత మంది ప్రయాణికులు గాయపడ్డారు. సీఐ రమేశ్‌బాబు తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. 108 అంబులెన్స్‌ల్లో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అవుకు, బనగానపల్లె క్లస్టర్ ఆసుపత్రులకు తరలించారు. సుబ్బలక్ష్మమ్మతో పాటు మరో మహిళకు తీవ్ర గాయాల కారణంగా కర్నూలుకు తరలించినట్లు స్థానిక వైద్య సిబ్బంది వెల్లడించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే బస్సు బోల్తా పడిందని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బస్సు బోల్తా ఘటనపై మంత్రి బీసీ ఆరా

బనగానపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడ్డ ఘటనపై రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఆరా తీశారు. గాయపడ్డ 20మంది ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి బీసీ వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు సరైన చికిత్సలు నిర్వహించాలని అవుకు, బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

మమ్మల్ని మోసం చేశాడు: రైతులు



మాట్లాడుతున్న బాధిత రైతులు

సి. బెళగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబదహాల్ గ్రామానికి చెందిన సర్వేస్వరరెడ్డి కుమారుడు హరికుమార్‌రెడ్డి 12 సంవత్సరా లుగా సి బెళగల్ కెనరా బ్యాంక్‌తో ఒప్పందం చేసుకుని బ్యాంక్ బీసీ పాయింట్ నడుపుకుంటూ తమను మోసం చేశాడని బాధిత రైతులు తెలిపారు. చింత మానుపల్లె, పలుకుదొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి, సి.బెళగల్, కబందహాల్ గ్రామాల రైతులు 20 రోజుల నుంచి హరికుమార్‌రెడ్డి ఫోన్ ఆఫ్‌లో ఉందని, కెనరా బ్యాంక్ మేజర్‌ను సంప్రదించగా.. తమకు తెలియదని చెప్పారని వారు అన్నారు. బాధిత రైతులు మంగళవారం పోలీసు స్టేషన్ ముందు కూర్చుని హరికుమార్‌రెడ్డికి ఎవరు ఎంత డబ్బు ఇచ్చిందీ తెలిపారు. ఈ మేరకు బాధిత రైతులు రాఘవరెడ్డి, ఓంకారం, మాలన్న, ఎల్లారెడ్డి, తిరుమలరెడ్డి, జయరామి రెడ్డి, శ్రీరాముడు, నరసింహగౌడు, నరసింహుడు, నాగన్న, శ్రీనివాసులు, లక్ష్మన్న, రంగస్వామి ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ బాధితులంతా వచ్చాక విచారణ చేపడతామని అన్నారు.

రమణీయం.. జోడు రథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న జోడు రథోత్సవం

- ఆకట్టుకున్న గొరవయ్యల నృత్యం



ఆకట్టుకున్న గొరవయ్యల నృత్యం



పత్తికొండ : జూటూరు గ్రామంలో సంజీవరాయ రథోత్సవం

హాలహర్వి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామంలోని గాదిలింగేశ్వర స్వామి, సిద్దేశ్వర స్వామి జోడురథోత్సవాలు రమణీయంగా సాగాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు హాజర్యారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. దేవదాయ శాఖ రాధాకృష్ణ, కరణం రాఘవేంద్రరావు, రెడ్డి రఘునందన్ గౌడ్, కురువ మల్లన్న రథచక్రాలకు పూజలు నిర్వహించారు. మంగళ హారతులతో వేద పండితులు మంత్రాలు వల్లిస్తుండగా రథాలను ముందుకు కదిపారు. జోడు రథోత్సవాలు ముందుకు సాగాయి. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై చంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉల్లిగమ్మ, కమిటీ సభ్యులు లింగమల్లప్ప, కుమారప్ప, బజారప్ప, వీరేశప్ప పాల్గొన్నారు.

ఘనంగా సంజీవరాయ రథోత్సవం

పత్తికొండ: జూటూరు గ్రామంలో మంగళవారం సంజీవరాయ రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం రథాంగహోమం నిర్వహించారు. సాయంత్రం రథోత్స వాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఈశ్వరప్ప, విజయ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. సీఐ జయన్న బందోబస్తు నిర్వహించారు.

కరెంటు ఉచ్చుల బారిన కణతులు

- ఇద్దరు వేటగాళ్లు పరార్
- అటవీ అధికారుల అదుపులో ఒకరు
- ముగ్గురిపై కేసు నమోదు

కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని గుమ్మడాపురం ఫారెస్టు బీట్‌లో వేటగాళ్లు విద్యుత్ వేర్లతో వేసిన ఉచ్చుల్లో పడి రెండు కణతులు మృతి చెందాయి. ముగ్గురు వేటగాళ్లలో ఇద్దరు పరారిలో ఉండగా.. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఆత్మకూరు అటవి శాఖ రేంజ్ అధికారి పట్టాభి తెలిపారు. సోమవారం రాత్రి గుమ్మడాపురం బీట్‌లోని విద్యుత్ స్తంభాలకు పెద్దగుమ్మడాపురం గూడేనికి చెందిన లింగస్వామి, అంకన్న అనే వేటగాళ్లు విద్యుత్ జే వైర్లను అమర్చారని తెలిపారు. వీటిలోపడి రెండు కణతులు మృతి చెందాయని ఆయన తెలిపారు. తమ రాక గ్రహించి వారు పరారయ్యారన్నారు. గుమ్మడాపురం గూడెంలో డాగ్ స్క్వాడ్ తనిఖీ చేస్తుండగా.. అదే గూడెంలో ఉన్న మాజీ సర్పంచ్ శంకరయ్య ఇంట్లోకి డాగ్ స్క్వాడ్ వెళ్లినట్లు చెప్పారు. ఆ ఇంటిని పరిశీలిస్తుండగా.. కుందేళ్లు, నెమళ్లకు వేసే ఉచ్చులు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని శంకరయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం మృతి చెందిన రెండు కణతులకు పోస్టుమార్టం నిర్వహించి, కాల్చివేశామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని, పారిపోయినవారిని కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు రేంజ్ అధికారి పట్టాభి తెలిపారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు కల్పించే నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామికరంగ అభివృద్ధికి ముందు కొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అన్నారు. వారు నూతన పరిశ్రమల ఏర్పాటుకు సత్వరం అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్‌బాబు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నెలాఖరు దాకా ఎల్లెల్సీ నీరు విడుదల

- గోనెగండ్ల సెక్షన్‌కు 110 క్యూసెక్కుల నీరు
- కోడుమూరుకు ఎల్లెల్సీ, జీడీపీ నీరు కలిసి 150 క్యూసెక్కులు



టైల్డ్యాంను పరిశీలిస్తున్న ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి

గోనెగండ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మార్చి నెల ఆఖరు వరకు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు సాగునీరు తుంగభద్ర డ్యాం నుంచి విడుదల అవుతుందని జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా ఇరిగేషన్ అధికారులు ఎమ్మిగనూరు గుడికల్ చెరువు నుంచి గోనెగండ్ల సెక్షన్ వరకు ఉన్న ఎల్లెల్సీ కాలువను చూశారు. గోనెగండ్ల దగ్గర ఎస్కేప్ చానల్ ద్వార ఎల్లెల్సీ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టులోకి పంపే చానల్‌ను పరిశీలించారు. అలాగే టైల్‌డ్యాం, 4/7 కోడుమూరు సెక్షన్ బార్డర్ లో ఉన్న కర్నూలు బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. కాలువ గట్లపై పెరిగి ముళ్ల చెట్లను తొలగించాలని కింది స్థాయి ఉద్యోగులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ దెబ్బతిన్న కాలువ గట్ల పనులకు అంచనా వేసి తమకు పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎల్లెల్సీ కింద పంటలు సాగు చేసుకున్న రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు. ఈ నెల చివరి వరకు నీటి విడుదల ఉంటుందని ఆలోగా ఆయకట్టు పొలాలో సాగు చేసుకున్న పంటలు అన్నీ చేతికి అందుతాయని అన్నారు. ప్రస్తుతం గోనెగండ్ల సెక్షన్‌కు 110 క్యూసెక్కుల నీరు మంగళవారం చేరిందన్నారు. కోడుమూరు ఎల్లెల్సీ సెక్షన్‌కు గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీ నీటి కోట నుంచి 84 క్యూసెక్కులు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 66 క్యూసెక్కుల నీరు కలిసి 150 క్యూసెక్కుల నీరు మళ్లిస్తున్నట్లు తెలిపారు. గోనెగండ్ల సెక్షన్‌కు 26 క్యూసెక్కులు వాడుకుంటున్నట్లు అందులో గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌లకు, ఎంఎల్ఎస్‌పీ, పీడీ, డీపీ 86 కాలువలకు మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈ బాలచంద్రరెడ్డి, ఎమ్మిగనూరు డీఈ విద్యాసాగర్, జీడీపీ డీఈ విజయ్ కుమార్, ఎల్లెల్సీ జీడీపీ ఏఈలు ఉదయ్ భాస్కర్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

అందరి వల్లే క్లస్టర్ వర్సిటీ అభివృద్ధి

- వీడ్కోలు సభలో ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్



పుస్తకాన్ని విడుదల చేస్తున్న వీసీ

కర్నూలు అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అందరి కృషి వల్లే క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధి చెందిందని ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. మంగళ వారం సిల్వర్ జూబ్లీ కళాశాలలోని ఆడిటోరియంలో ఉపకులపతి వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'ఉపకులపతిగా నేను అనే' ఆయన ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వర్శిటీకి మొదటి ఉపకులపతిగా అవకాశం రావడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తానన్నారు. ఈ వర్శిటీ రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యా లయంగా భవిష్యత్‌లో వెలుగొందుతుందని అన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీలో నిపుణులైన అధ్యాపకులు ఉండడం విద్యార్థులకు వరమన్నారు. మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి సహకారంతో క్లస్టర్ వర్సిటీని తన వంతు అభివృద్ధి చేశానని అన్నారు. రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ క్లస్టర్ భవిష్యత్‌లో ఒక మంచి విశ్వవిద్యాలయం అవుతుందన్నారు. చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ గతంలో పీజీ చదవాలంటే మద్రాస్‌కు, తిరుపతికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు కర్నూలు జిల్లాలో నాలుగు వర్శిటీలు ఉన్నాయని అన్నారు. జేఎస్ఆర్‌కే శర్మ, ఎలమర్తి రమణయ్య క్లస్టర్ విశ్వవిద్యాలయంపై కవితలు చదవి వినిపించారు. అనంతరం ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, వాసంతి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వీవీఎస్ కుమార్, ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, హేమంత్, దేవికారాణి, అనూష హాజరయ్యారు.

పన్ను వసూళ్లలో పూర్!

పాణ్యం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రకటనల పన్నులతో గ్రామాభివృద్ధి పెంచుకోవాలని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అయితే ఆ దిశగా పాణ్యం మండలంలో జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పన్నులు వసూలు చేయకపోవడంతో గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి పడుతోంది. పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధిలో అమడదూరంలోనే ఉన్నాయి. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది అధికారులకు మామూళ్లు ముడుతుండడంతో ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

- ప్రకటనల పన్ను వసూలుపై అనాసక్తి
- వనరుల ఆదాయం పెంచుకోలేని దుస్థితి
- గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి
- అభివృద్ధికి నోచుకోని గ్రామాలు



ఏటా రూ. 64.99 లక్షలు

మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో రూ. 64,99,485లక్షల డిమాండ్ ఉండగా రూ. 22,74,497 వసూలు జరిగింది. ఇందులో గృహ పన్ను రూ. 47,23,365 ఉండగా రూ. 13, 05,612 వసూలు జరిగింది. నాన్ ట్యాక్స్ రూ. రూ. 17,76,120 ఉండగా రూ. 9, 68, 885 వసూలు జరిగింది. పాణ్యం గ్రామ పంచాయతీలో ఈ ఏడాది రూ. 23, 28, 728 లక్షలు గృహ రూ. 14, 05, 580 గృహేతర పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.7, 11, 369 గృహ పన్ను, రూ. 9, 21, 620లు గృహేతర పన్ను వసూలు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పన్ను చెల్లించని ప్రభుత్వ శాఖలు

పాణ్యం గ్రామ పంచాయతీ పన్ను వసూళ్లలో ప్రభుత్వ శాఖల పన్నులు బకాయి దాదాపు రూ. 5 లక్షల మేర ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామానికి అవసరమైన వసతుల కల్పనలో నిధుల కొరత ఏర్పడుతోంది. 14 వేల జనాబా ఉన్న పాణ్యం గ్రామంలో ఇంకా పలు రకాల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా అధికారులు, పంచాయతీ సభ్యులు నిర్లక్ష్యంగా ఉన్నారు. పాణ్యం గ్రామానికి వసూలయ్యే రూ. 37, 34లక్షలు గ్రామ అభివృద్ధి ఖర్చులకు ఏమాత్రం సరిపోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులకు పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు తోడ్పాటునందించి పన్ను వసూళ్లపై మరింత చర్యలు చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.



అధికారుల నిర్లక్ష్యం

ప్రచార ప్రకటనల ద్వారా ఆదాయాన్ని పంచాయతీలు వసూలు చేయాలి. అయితే వాటివైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ఏటా లక్షలాది ఆదాయాన్ని గ్రామ పంచాయతీలు కోల్పోతున్నాయి. అధికారులకు మామూళ్ల ముడుతుండడంతో ఏమి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజలపై వివిధ ప్రకటనల భారం మోపే వ్యాపార సంస్థలు ప్రకటనల పన్ను చెల్లించడంలో మాత్రం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తోంది.

ప్రకటనల పన్ను వసూలు చేస్తాం

వాణిజ్య ప్రకటనల పన్ను వసూలు చేయడానికి పంచాయతీ కార్యదర్శులకు సూచిస్తాం. పంచాయతీ రాజ్ చట్టంలో ప్రకటనల పన్ను వసూలుకు యాక్ట్ ఉంది. ఈ యాక్ట్ ప్రకారం వాణిజ్య సంస్థలకు నోటీసులు అందించి ప్రకటనల పన్ను వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడుతాం.

- చంద్రమౌళీశ్వరగౌడ్, ఈఓఆర్‌డీ పాణ్యం

పన్ను వసూలు చేసేవి ఇవే..

ప్రతి పంచాయతీ తన అధికార పరిధిలో ప్రభుత్వ ముందస్తు అనుమతితో గ్రామ పంచాయతీ నిర్ణయించిన పన్నులను విధించవచ్చు. గ్రామ పంచాయతీ వసూలు చేసే పన్నుల్లో ఇంటి పన్ను, ప్రకటన పన్ను, వాహన పన్ను, లాట్రిన్ పన్ను, నీటి పన్ను, లైటింగ్ పన్ను, డ్రైనేజీ పన్ను, ఉత్సవాలు, పండుగల పన్ను, మార్కెట్‌పన్ను, ఆటో స్టాండ్ పన్ను, జంతువుల అమ్మకాలపై పన్ను, డీలర్లపై పన్ను, బ్రోకర్ లైసెన్స్ పన్ను, టెలికమ్యూనికేషన్ టవర్ల పన్ను, భవన నిర్మాణాల పన్ను, గృహ పన్ను, క్వారీ పన్ను, వినోదం పన్ను, ఆస్తి పన్ను, వృత్తి పరమైన పన్ను, తదితర సేవల పన్నులను వసూలు చేసే అధికారాలు గ్రామ పంచాయతీకి ఉన్నాయి. గ్రామాలలోని మౌలిక వసతులు సమకూర్చుకోవడానికి ప్రాథమిక సేవలు, సౌకార్యాలు అందించడానికి గ్రామస్తులపై పన్ను విధించడం గ్రామ పంచాయతీకి అధికారాలు ఉన్నాయి.

సర్వీస్‌రోడ్డును ఏర్పాటు చేయాలని వినతి


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాములపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ శివార్లలో చేపడుతున్న హైవే పనుల్లో చెలిమిళ్ల గ్రామానికి వెళ్లే రహదారిలో సర్వీస్‌రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు, ప్రజలు కోరారు. మంగళవారం తహసీల్దార్ సుభద్రమ్మకు సీపీఎం నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ తహసీల్దార్, వెలుగు కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సచివాలయానికి వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు హైవేపై ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. సర్వీస్‌రోడ్డు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేషబాబు రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పాములపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ శివార్లలో నూతనంగా నిర్మించిన ఆలయంలో చౌడేశ్వరిదేవి ప్రతిష్ఠ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజు మంగళవారం మహిళలు చౌడేశ్వరిదేవి బోనాలను సమర్పించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి


ఆరోగ్యశాఖ అధికారి దివ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నందికొట్కూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై 6న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ని ఆశా వర్కర్‌గా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు క్యాజువల్ లీవ్స్, వయోపరిమితి 62కు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు తదితర ఒప్పంద జీవోల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఆరోగ్య శాఖ అధికారి దివ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నజీరున్నిస్సా, రంగమ్మ, మంజుల, పరమేశ్వరి, అనసూయమ్మ, జ్ఞానమ్మ, నాగస్వాముమ్మ, ఉమావతి, జ్యోతి పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 22 మంది ఎంపిక

నందికొట్కూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 22 మంది ఎంపికైటన్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.సునీత తెలిపారు. మంగళవారం నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు కంపెనీలు జాబ్‌మేళాను నిర్వహించాయి. ఇందులో 45 మంది హాజరుకాగా 22 మంది ఉద్యోగ అర్హత సాధించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.సుబ్బన్న, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సి.వెంకటరమణ, ఏపీఎస్ఎన్‌డీసి సీడాప్ ఎంప్లాయిమెంట్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న డీడీఏ చెన్నయ్య

మిడుతూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని డీడీఏ చెన్నయ్య అన్నారు. మంగళవారం పీరుసాహెబ్ పేట, మిడుతూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత పంటల యాజమాన్యం పట్ల అవగాహన కల్పించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో మల్లిఖార్జున రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి విడనాడాలి

బండిఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో మానసిక ఒత్తిడి విడనాడాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సింధుజ సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్ దాక్షాయిని ఆధ్వర్యంలో మానసిక స్థితిగతులపై అవగాహన సమావేశం నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న మహేశ్‌నాయుడు


అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పాములపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని గ్రామ శివార్లలో నూతనంగా ప్రతిష్ఠించిన చౌడేశ్వరిదేవి అమ్మవారిని రాష్ట్ర సివిల్ కార్పొరేషన్ డైరెక్టర్ తలముడిపి మహేశ్‌నాయుడు దర్శించుకొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ తెలుగుయువత మండల అధ్యక్షుడు మధుక్రిష్ణతో కలిసి దర్శించుకొన్నారు.

ఎన్‌హెచ్-167కే భూముల పరిశీలన

కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి 167కేకు చెందిన ఎర్రమఠం సిద్దేశ్వరం భూములను తహసీల్దార్ ఉమారాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌హెచ్-167కే రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు సుమారు 25 మంది ధ్రువపత్రాలు ఇవ్వలేదన్నారు. వారికి చెందిన 18 ఎకరాల భూములలో ఎక్కడి నుంచి ఎటువైపు రహదారి వెళ్తుందని ఫీల్డ్ విజిట్ చేసి పరిశీలన చేశామన్నారు. రైతుల వద్ద ఉన్న భూములను చెందిన పత్రాలను పరిశీలించామని అందరూ వారి పత్రాలను అధికారులకు ఇవ్వాలని సూచించామన్నారు.

హామీలను అమలు చేయాలి


హెల్త్ ఎడ్యుకేటర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశావర్కర్లు

ఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు చేపట్టిన సమ్మెకాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు చంద్రకళ పేర్కొన్నారు. ఈ మేరకు హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2024 ఫిబ్రవరి 9వ తేదీన ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఆశా కార్యకర్తలు పనిభారంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. ఒక సెలవు తీసుకోవాలన్నా అధికారుల దయాదాక్షణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. వేతనాలను పెంచడంతో పాటు ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కాగా మార్చి 6న జరిగే రాష్ట్రధర్నాలో ఆశా కార్యకర్తలందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జీవరత్నమ్మ, రాధమ్మ, లింగమ్మ, భారతి, రమిజాబీ, సరళ, గౌసియా, చెన్నమ్మ తదితరులు ఉన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలని థెరిసా జూనియర్ కళాశాల డైరెక్టర్ సాయిప్రణీత్ పేర్కొన్నారు. ఇటీవల పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాస పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారికి మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో భయాందోళనకు గురికాకుండా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశకాలతో ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షలను రాయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్‌కుమార్, బాలాజీ, అంజి, దిలీప్, రవి, చిన్న, ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.

లోకకళ్యాణార్థం విశేష పూజలు



భజనలు చేస్తున్న భక్తులు

శ్రీశైలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం పురస్కరించుకుని లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి), నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూ జలు నిర్వహించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతపురం జిల్లా, కోనాపురంకు చెందిన రామలింగేశ్వరస్వామి భజన మండలి బృందంచే భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. భజన గీతాలను జయచంద్రారెడ్డి, వెంకటస్వామి, శ్రీనివాసులు, వెంకటాచలం, కులశేఖర్, ఆదికేశవులు, రాజు, హరినాథ్‌రెడ్డి, శ్రీరాములు, సరస్వతి, శాంతమ్మ తదితరులు ఆలపించారు.

నేటి నుంచి ఆత్మకూరులో మినరల్ వాటర్ ప్లాంట్ల మూసివేత

ఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీల్లో సంభవించిన అతిసార సమస్యను దృష్టిలో వుంచుకుని బుధవారం నుంచి అన్ని వాటర్ ప్లాంట్లను మూసివేయాలని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు మంగళవారం నిర్ణయించారు. పట్టణంలోని నీలితొట్లవీధిలోని ఓ వాటర్ ప్లాంట్ ద్వారా కలుషితం జలాలతో అతిసార ప్రబలి పలువురు మృతిచెందడం, మరికొంత మంది అస్వస్థతకు గురవ్వడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పట్టణంలోని 19 ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నీటి నమూనాలను అధికారులు సేకరించి కర్నూలులోని రీజనల్ ల్యాబ్‌కు పంపించడం జరిగింది. వాటిలో ఇప్పటికే రెండు వాటర్ ప్లాంట్ల నివేదికలో రాగా అందులో నీలితొట్లవీధిలోని బిస్మిల్లా వాటర్ ప్లాంట్‌లో ఈ-కోలీ బ్యాక్టీరియా ఉండటంతో ఆ ప్లాంట్‌ను అధికారులు సీజ్ చేశారు. దీంతో మిగిలిన అన్ని వాటర్ ప్లాంట్ల రిపోర్టులు వచ్చే వరకు ప్లాంట్లను మూసి వేయాలని ప్లాంట్ల నిర్వాహకులు నిర్ణయించారు.

సారాతో జీవితాలను నాశనం చేసుకోవద్దు


ప్రజలు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆత్మకూరురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సారాతో జీవితాలనునాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ గూడెం వాసులకు సూచించారు. నాటుసారా తయారు చేయకండి,నాటుసారా సేవించకండి అంటూ గూడెం వాసులకు నవోదయం 2.0 కార్యమంలో భాగంగా నాగలూటి గూడెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నాటు సారా సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. గ్రామంలో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారీ,రవాణా, అమ్మకాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఆత్మకూరు మండలంలోని సిద్దపల్లి గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు. అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 700 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి,జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్ సేవలు అభినందనీయం



నంద్యాల కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌మెన్ సేవలు అభినందనీయమని విద్యుత్ ఈఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. నంద్యాల డివిజన్ కార్యాలయలో జాతీయ విద్యుత్ లైన్‌మెన్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైన్‌మెన్‌లు 24గంటలు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో నంద్యాల రూరల్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రమేష్, ఏఈలు నాగరాజు, సుబ్బారావు, నంద్యాల పట్టణ, రూరల్ లైన్‌మెన్లు, వివిధ సెక్షన్ల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరోసారి అవకాశమివ్వండి

పాణ్యం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేకు హాజరుకాని రైతులకు మరోసారి అవకాశమివ్వాలని నంద్యాల జాయింట్ కలెక్టరు విష్ణు చరణ్ ఆదేశించారు. మంగళవారం పాణ్యం మండలంలోని గగ్గటూరులో జరుగుతున్న రీసర్వేను జేసి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సర్వేలో ఇబ్బందులు తెలుసుకున్నారు. రీసర్వేకు నోటీసులు ఇచ్చారా అని రైతులను అడిగారు. నోటీసులు అందకున్నా, రీసర్వేకు హాజరు కాకపోయినా మరోసారి రైతులకు అవకాశమివ్వాలని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్, సర్వే ఇన్‌స్పెక్టర్, మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

ఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చునని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సరైన సమతుల్య ఆహారం తీసుకోవడం రక్తహీనత నివారించవచ్చునని తెలిపారు. ప్రతిరోజు తినే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, పాలు తీసుకోవడం వల్ల విటమిన్లు, లవణాలు, ప్రొటీన్లు లభ్యమవుతాయని తెలిపారు. వేరుశనగ విత్తనాలు బెల్లంతో కలిపి తినడం వల్ల హిమోగ్లోబి న్ శాతం పెరిగి రక్తం వృద్ధి చెందుతోందని అన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారీ, వైస్‌ప్రిన్సిపల్ పద్మావతిబాయి, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ తిరుపతమ్మ ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



గడివేముల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్‌పి రఫిక్, ఎస్‌పి కాలిక్ రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ను ఇచ్చారు. టీడీపీ నాయకుడు మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు.

వెండి నాగపడగ వితరణ

పాణ్యం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం నంద్యాల మండలం, రైతు నగర్‌కు చెందిన భక్తులు గాధం శెట్టి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు కిలో 50 గ్రాముల వెండినాగపడగను వితరణ గావించారు. ఆలయ సిబ్బంది వారితో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయసిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

హరినామ భజన ప్రారంభం

ఆత్మకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని తోటగేరిలో గల చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో మంగళవారం నిరవధిక హరినామ భజన కార్యక్రమం ప్రారంభమైంది. హరేరామ హరేకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో 140 పౌర్ణమిలు, 282 ఏకాదశిల్లో చేపట్టిన అఖండ హరినామ భజన పూర్తయిన సందర్భంగా 11రోజుల పాటు నిరవధికంగా హరినామ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాధాకృష్ణుల రథోత్సవ కార్యక్రమాన్ని సంప్రదాయంగా నిర్వహించారు.

భూమి ఒకరిది.. పరిహారం మరొకరికి

- ఎన్‌హెచ్-167కే భూసేకరణ అధికారుల నిర్వాకం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న బాధితుడు

కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామ శివారులో రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోయిన రైతుకు పరిహారం అందాల్సి ఉంది. కాగా.. ఎన్‌హెచ్-167 కే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అదే గ్రామానికి చెందిన ఓ మహిళ బ్యాంకు ఖాతాకు పరిహారం జమ అయింది. ఈ ఘటన కొత్తపల్లి మండలం సింగరాజుపల్లిలో చోటు చేసుకుంది. మండలంలోని గుమ్మడాపురం మజరా గ్రామమైన సింగరాజుపల్లికి చెందిన మూగి వెంకటరమణారెడ్డి అనే రైతుకు చెందిన సర్వేనెం.331లో 13 సెంట్ల భూమి కల్వకుర్తి-నంద్యాల ఎన్‌హెచ్-167కె జాతీయ రహదారి నిర్మాణంలో పోయింది. ఈ రైతుకు రావాల్సిన రూ.47,756 నష్టపరిహారాన్ని జనవరి 31న రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంది. అయితే సదురు రైతుఖాతాకు నగదు జమ కాలేదు. దీనిపై నంద్యాల కలెక్టరేట్‌లోని భూసేకరణ అధికారులను రైతు విచారించగా.. రెండో విడతలో జమ అవుతాయని చెప్పి పంపారు. తీరా చూస్తే మార్చి 4న మంగళవారం ఇదే సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మారేరు యోహాన్ భార్య ప్రమీలమ్మ బ్యాంకు ఖాతాకు తనకు రావాల్సిన పరిహారం సొమ్ము జమ అయినట్లు వెంకటరమణారెడ్డికి తెలిసింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ప్రమీలమ్మ పొలం తన పొలం పక్కన కూడా లేదని, అలాంటప్పుడు ఆమె ఖాతాకు తనకు రావాల్సిన పరిహారం జమ చేస్తారని అధికారులను నిలదీశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానని రైతు రమణారెడ్డి తెలిపారు.

బహిరంగ వేలంలో రూ.40.73 లక్షలు


వేలాలు నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.40.73 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ పరిధిలోని పోచా విశ్రాంతి భవనంలో ఏడాది పాటు భక్తుల ఏర్పాట్లలో భాగంగా నిర్వహించిన వేలాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో భక్తులు సమర్పించే కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనే హక్కును మహానందికి చెందిన మూల స్థానం ఉమాదేవి రూ.14.51,199 లక్షలకు దక్కించుకొందన్నారు. అలాగే జెఎస్ డబ్ల్యూ మరుగుదొడ్ల నిర్వహణను హరీష్‌కుమార్ రూ.5,50,000లకు, సాంప్రదాయ దుస్తులు విక్రయించుకొనే లైసెన్స్ హక్కును హరినాథ్ రూ.11,07,000లకు, భక్తుల వాహనాల పూజలు నిర్వహించుకునేందుకు విష్ణుచరణ్ రూ.2,50,099, అలాగే పెద్దనంది విగ్రహం ఖాళీ స్థలంలో హోటల్ నిర్వహించుకొనేందుకు మధుసూదన్ రూ. నెలసరి బాడుగ రూ.16 వేలు, కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో హోటల్ నిర్వహించుకొనేందుకు కోసం రూ.17 వేల 500కు యం. రమేష్ దక్కించుకున్నాడు. వీటితో పాటు దేవస్థానం మాన్యం భూములకు మూడు సంవత్సరాల కాలపరిమితి కింద 8 ఎకరాల 96 సెంట్ల మాన్యం భూమికి బుక్కాపురానికి చెందిన రైతు కందుల రఘురామిరెడ్డి రూ.3,10,000,లకు, అలాగే1.31 సెంట్ల భూమిని వినోద్‌కుమార్ రూ.31 వేలకు, యం.సుబ్బరాయిడు రూ13,100 వందకు బహిరంగ వేలంలో దక్కించుకొన్నట్లు ఈవో పేర్కొన్నారు. మిగిలిన టోల్‌గేట్ రుసుం వసూలు చేసే హక్కు, టెలిఫోన్ కేంద్రం వద్ద మరుగుదొడ్ల నిర్వహణతో పాటు భక్తుల పాదరక్షలు భద్ర పరిచే హక్కులకు బహిరంగ వేలంలో దేవస్థానానికి అనుకున్నంత ఆదాయం రాక పోవడంతో వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ యర్రమల్ల మధు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌శెట్టి, సిబ్బంది నాగమల్లయ్య, మల్లిఖార్జున పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజక వర్గం పరిధిలోని కేసీకెనాల్ చివరి ఆయకట్టు రైతులకు సైతం సాగునీరు అందిస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు సాగునీరు అందక సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. తుంగభద్ర నుంచి 1.9 టీఎంసీల నీటిని అందిస్తామని అధికారులు చెప్పినప్పటికి కేసీకెనాల్‌కు సాగునీరు వచ్చేందుకు మరో వారం రోజులు సమయం పడుతుండటంతో రైతుల ప్రయోజనార్థం సుంకేసుల నుంచి 0.9 టీఎంసీల నీటిని కేసీకెనాల్‌కు తీసుకొస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కేసీ కెనాల్ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యను సంబంధిత మంత్రులతో పాటు అసెంబ్లీలో సైతం చర్చిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు.

ఘనంగా సుంకులమ్మ దేవర



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ

డోన్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుంపల్లె గ్రామంలో సుంకులమ్మ దేవర ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజల్లో పా ల్గొన్నారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నా యకులు ఓబులాపురం శేషిరెడ్డి, కమలాపురం గ్రామ సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఎద్దుపెంట మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మిద్దెపల్లి గోవిం దు పాల్గొన్నారు. కొత్తకోట గ్రామంలో నిర్వహించిన దేవరలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు. గ్రామ పెద్దలు మాజీ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అలాగే గ్రామస్థుడు మనోహర్ ఆహ్వానం మేరకు టీడీపీ నాయకుడు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న వైద్యురాలు అంజలి

చాగలమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైద్యురాలు అంజలి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. తల్లిదండ్రులు ఆడ పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి తీసుకొని రావాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. వేసవిలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ధర్నాను జయప్రదం చేయండి'

ప్యాపిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్న రహిమాన్ కోరారు. మంగళవారం మండలంలోని జలదుర్గం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా వర్కర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నరహిమాన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 6న విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో ఆశా వర్కర్ల రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రహిమాన్ తెలిపారు. వైద్యాధికారి నుస్రత్‌బేగంను ఆశావర్కర్లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

బేతంచెర్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీలో డాక్టర్ ఆలీమ్‌కు ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు, సీఐటీయు నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్వతి, సుజాత, పుష్పావతి, నాగమ్మ, రాజేశ్వరి, మద్దమ్మ, వెంకటలక్ష్మి, శాంతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్యాపిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని అరుణాచల ట్రాన్స్‌పోర్టులో హనుమాన్ ఆలయంలో మంగళవారం 8వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆకుపూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారిణి దీపకుమారి తెలిపారు. మంగళవారం చిన్నవంగలి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. దూడలకు బ్రూసెల్లేస్ వ్యా ధి నివారణ టీకాలు వేశామని అన్నారు. ఈనెల చివరి వరకు ఆయా గ్రామాల్లో గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయడం జరు గుతుందని, రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించి టీకాలు వేయించు కోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాడి పశువుల యజమానులు గాలికుంటు నివారణ టీకాలు పశువులకు తప్పనిసరిగా వేయించుకోవాలని పశువైద్యాధికారి రమేష్‌బాబు వెల్లడించారు. మంగళవారం తిమ్మనాయినిపేట గ్రామంలో సుమారు 600 పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు.

2,500 మంది కూలీలకు 'ఉపాధి' పనులు

చాగలమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో 2,500 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి నోటీసులు ఇచ్చామన్నారు. సంబంధిత ఎఫ్‌ఏలు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంటుందని అన్నారు. టీఏ, ఎఫ్ ఏలు మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

పీ-4 సర్వే 92 శాతం పూర్తి

కొలిమిగుండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో పీ-4 సర్వే ఇప్పటివరకు 92శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి మంగళవారం వెల్లడించారు. మొత్తం 14069 కుటుంబాలకు గాను 12915 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన 8.27శాతాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

కోవెలకుంట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని దివ్యాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ మినహా ఏ ఒక్క సంక్షేమ పథకం అందలేదన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించి తద్వారా దివ్యాంగులకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. అంత్యోదయ కార్డులు, త్రీవీలర్ స్కూటీలు, దివ్యాంగులకు అందాల్సిన రైల్వే రాయితీ పాసులు, ఉచిత బస్సు పాస్, ఉచిత సిలిండర్లు తదితర సంక్షేమ పథకాలు దివ్యాంగులు కార్పొరేషన్ చైర్మన్ ద్వారా అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రహదారులపైనే చెత్త

- ఇంటింటి చెత్త సేకరణపై అధికారుల నిర్లక్ష్యం
- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

కొలిమిగుండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కొలిమిగుండ్లలో పంచాయతీ కార్మికులు ఇంటింటి చెత్త సేకరణ చేపట్టకపోవడంతో ఇళ్లలోని చెత్తను ఎక్కడ వేయాలో తెలియక ప్రజలు ప్రధాన రహదారుల్లోనూ, వీధుల్లోనూ, వంకల్లోనూ పడేస్తున్నారు. దీంతో పందులు, కుక్కలు ఇష్టానుసారంగా గెలుకుతూ దోమలకు, అపరిశుభ్రతకు నిలయంగా మారుస్తున్నాయి.

కొలిమిగుండ్ల గ్రామ పంచాయతీకి సంబంధించి ఆరుమంది గ్రీన్ అంబాసిడర్లు అందుబాటులో ఉన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీకి ఒక ట్రాక్టరును కూడా మంజూరు చేసింది. దీంతో పాటు గతంలో 2014 తరువాత అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి, గ్రామ సమీపంలో చెత్త సంపద కేంద్రాన్ని సైతం నిర్మించారు. అయితే అన్నీ వున్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా అందుబాటులో అన్ని వ్యవస్థలు ఉన్నా చెత్త సేకరించ డం లో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. సుమారు ఎనిమిదివేల జనాభా నివసిస్తున్న కొలిమిగుండ్లలో చెత్త సేకరణ చేపట్టకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం పాటుపడాలని ఓ వైపు ప్రభుత్వం మొత్తుకుంటున్నా కిందిస్థాయి అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

శిథిలావస్థలో చెత్త సంపద కేంద్రం

రూ.లక్షలు వెచ్చించి గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరాయి. పంచాయతీకి ట్రాక్టరు అందుబాటులో ఉండి కూడా చెత్త సంపద సృష్టించడంపై అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి అందుబాటులోకి తెచ్చిన ట్రాక్టరు, చెత్త సంపద కేంద్రం శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఏర్పడింది.



ప్రధాన రహదారిలో పడేసిన చెత్త



చెత్తకు నిలయంగా మారిన ఎర్రవాగు వంక



నిరుపయోగంగా ట్రాక్టరు



శిథిలావస్థకు చేరుకున్న చెత్త సంపద కేంద్రం

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



కంకరగురెడ్డి కళాశాలలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి

బనగానపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో సమస్యాత్మక ఇంటర్ పరీక్షా కేంద్రమైన కంకరగురెడ్డి కళాశాలను డిప్యూటీ సీఈవో తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బనగానపల్లె కంకరగురెడ్డి కళాశాల, శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నంద్యాల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల, రాహుస్ జూనియర్ కళాశాల, సీఎంఎస్ జూనియర్ కళాశాలలను సమస్యాత్మక కళాశాలలుగా ఇంటర్ బోర్డు గుర్తించిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కళాశాలలకు ఒక స్పెషల్ అధికారిని నియమించిందని వారి ఆధ్వర్యంలో అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల గదుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇంటర్‌బోర్డుకు అనుసంధానం చేశామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రమణ, సిబ్బంది ఉన్నారు.

పంట మార్పిడితో మంచి దిగుబడులు : డీఏవో

శిరివెళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పొలాల్లో ఏటా పంట మార్పిడి విధానం ద్వారా వివిధ రకాల పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెన్నూరు గ్రామంలో రైతుల పంట పొలాలను ఆయన పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. మిరప సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రబీ పంటలను రైతులు ఈ నెల 6వ తేదీలోగా ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, డీపీఎం నాగేంద్ర, మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఏఈవో రాజేశ్వరరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చాగలమర్రి: గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు చీడపీడలపై అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్, ఈకేవైసీ, గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు.



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

మహిళ ఆత్మహత్య

శిరివెళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వనికెందిన్నె గ్రామానికి చెందిన జిలకర మాధవి(38) ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం జరిగింది. మాధవి భర్త చిన్న మౌలాలి మద్యానికి బానిసై కుటుంబ పోషణను పట్టించుకోకపోవడంతో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

దొర్నిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చికిత్సపొందుతూ రైతు మృతి చెందాడు.ఈ ఘటన మంగళవారం రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రవి తన కుమారుడు అక్కల కరుణాకర్ (21) కొన్నేళ్లగా పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలను సాగు చేసేవాడు. రెండేళ్లుగా సీడు పత్తిలో నష్టం రావడంతో దాదాపు రూ.15 లక్షలు అప్పు అయింది. నాలుగు నెలల క్రితం రవి మృతి చెందాడు. అప్పుల భారం కుమారుడిపై పడింది. దీంతో మనస్తాపానికి గురైన కరుణాకర్ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, టీడీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు బొబ్బూరి వెంకటస్వామి , టీడీపీ నాయకులు ఉన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

దొర్నిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. జమ్ములమడుగు నుంచి దొర్నిపాడుకు టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా జడ్పీహైస్కూల్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

డోన్ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ వర్క్ పనులు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఈఈ కమలాకర్ సూచించారు. మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో జాతీయ విద్యుత్ లైన్‌మెన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో, రూరల్‌లో పని చేసే లైన్‌మెన్లు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, రవీంద్ర, వరప్రసాద్, కాటంరాజు, నాగరాజు, కృష్ణమాచారి, కృష్ణారెడ్డి, వెంకట్రాముడు, కృష్ణమోహన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో డీఈఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి, జూనియర్ ఇంజనీర్ నాగరాజు, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీరాములు, చంద్రశేఖరయ్య, రసూల్‌గౌస్, ఉదయ్, సాయిపురుషోత్తం పాల్గొన్నారు.

రైతులకు తోడ్పాటునిద్దాం

డోన్ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండిస్తున్నటు వంటి ఆర్గానిక్ కూరగాయలను ప్రజలు కొనుగోలు చేసి వారికి తోడ్పాటు ఇద్దామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణం వద్ద గోసానిపల్లె, ధర్మవరం గ్రామాలకు చెందిన దమయంతి, శ్రీదేవి, లలితమ్మ మహిళా రైతులు కూరగాయల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, వెంకట్రాముడు, సుంకన్న, కుమ్మరి రాజు పాల్గొన్నారు.

'జీవోలను రద్దు చేయాలి'

డోన్ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లపై భారీగా జరిమానాలు విధించే జీవో 21, 31ను రద్దు చేయాలని ఏపీ ఆటో వర్కర్స్ అండ్ నియోజకవర్గ యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్‌గౌడు, అన్వర్, ఐటీయాసీ ప్రధాన కార్యదర్శి సుంకయ్య, అబ్బాస్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆటో యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో క్రైస్తవులకు పెద్దపీట

అవుకు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో క్రైస్తవులకు పెద్దపీట వేసిందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు అన్నారు. మంగళవారం మండలంలోని శింగనపల్లె గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులతో సమావేశాన్ని నిర్వహించారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి రూబెన్, నాగరాజు, డేవిడ్, తేజ పాల్గొన్నారు.

బహిరంగ విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని కమిషనర్ కిషోర్ కోరారు. మంగళవారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ అంశంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే 15 రోజుల్లో రాత పూర్వకంగా కార్యాలయంలో అందజేస్తే పరిశీలించి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని కమిషనర్ వెల్లడించారు.

జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వశాంతి విద్యానికేతన్‌లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి శంకర్ జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు కరస్పాండెంట్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. విజయవాడలో ఈ నెల 2న జరిగిన జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థి శంకర్ ద్వితీయస్థానం సాధించినట్లు వెల్లడించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు

రుద్రవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో మురుగుకాల్వలు నిర్మిస్తున్నట్లు ఈవో సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఎంపీపీ బాలస్వామి దళిత కాలనీలో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మం పాల్గొన్నారు.

నూతన చట్టాలు రద్దు చేయాలి: ఏఐటీయూసీ

కొలిమిగుండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 894 గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తీసుకవచ్చిన కొత్త చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ, ఆటో కార్మిక సంఘం నాయకులు వడ్డె మహేష్, ఆటో రాజు, మెకానిక్ చంటి తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండు వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఆటో వాలలపై అధికారుల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం కంబడిరి, శ్రీరంగ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పారిశుధ్య మెరుగునకు చర్యలు

- తాహిర్‌హుసేన్, ఈవోఆర్డీ , చాగలమర్రి



చాగలమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చాగలమర్రి ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో మురుగు కాలువలు శుభ్రం చేయడంతో పాటు వీధుల శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: ఇంటి పన్నుల వసూలు చేపడుతున్నారా?

జవాబు: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 80 శాతం ఇంటి పన్నుల వసూళ్లు చేశాం. మిగిలిన 20 శాతం మార్చి చివరికి పూర్తి చేస్తాం. శానిటేషన్, ట్యాంకు శుభ్రతపై ప్రత్యేక దృష్టి ఉంచాం.

ప్రశ్న: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తున్నారా?

జవాబు: 17 సచివాలయాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారు. సచివాలయాల తనిఖీలు చేపట్టి విధులకు హాజరు కాని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: పంచాయతీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: 15వ ఆర్థిక సంఘం నిధుల, పల్లె పండుగ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తూ సమస్యలపై తీర్మానాలు చేసి పరిష్కరిస్తున్నాం. గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: అక్రమ కొళాయి కనెక్షన్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గ్రామంలో అక్రమ కొళాయి కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి ఉంచాం. కొళాయి కనెక్షన్ కావాల్సిన వారికి ముందుగానే డిపాజిట్ చెల్లించిన తరువాత కనెక్షన్ ఇస్తున్నాం.

ప్రశ్న: అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: అనుమతి లేకుండా కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవు. లేఔట్‌లు వేసే ముందు అనుమతి తప్పనిసరి. చాగలమర్రి మేజర్ పంచాయతీలో నిర్మించుకుంటున్న గృహాలకు ముందుగానే ప్లాన్ ఇచ్చి కట్టడాలు చేసుకునేలా చూస్తున్నాం. అక్రమ కట్టడాలను తొలగించి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటాం.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

డోన్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. డోన్ రైల్వే స్టేషన్ పరిధిలోని లింగాయనదొడ్డి గ్రామం వద్ద ఒడిషాకు చెందిన ప్రయాణికుడు రైలులో ప్రయాణిస్తూ కాలు జారి కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సూచనల మేరకు ద్రోణాచలం సేవా సమితి సభ్యులు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించడానికి అయిన ఖర్చులను డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు షాదీఖానా రాజా, సభ్యుడు గురుస్వామి, కేరళ రవీ తదితరులున్నారు.

నాటుసారా తయారీకి దూరంగా ఉండాలి

డోన్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి దూరంగా ఉండాలని డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ సీఐ వరలక్ష్మి సూచించారు. మంగళవారం డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆలేబాదుతండా గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్యాపిలి మండలం సిద్ధనగట్టు గ్రామంలో ఎక్సైజ్ దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 80 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సోమశేఖర్, దౌలత్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

బనగానపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని పలుకూరు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం మండలం రామతీర్థం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బ్రహ్మానందాచారి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదనగోపాల్, బాష, మద్దిలేటి, సుబ్బరాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

బనగానపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన యువతి లక్ష్మి వివాహానికి టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, శంఖేశ్వరరెడ్డి మంగళవారం రూ. 21వేల ఆర్థిక సాయం అందించారు. టీడీపీ నాయకులకు లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్రాష్ట్ర పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోవెలకుంట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీల్లో పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 1నుంచి 3వరకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో అంతర్రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి సెయింట్‌జోసెఫ్ పాఠశాల నలుగురు విద్యార్థు లు నాగ ఉదయ్, అనిఫ్, ప్రణయ్, నిఖిల్ జూనియర్ విభాగం, సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ గీతా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ఓబులేసు, హర్ష, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కుందూలో తగ్గిన నీటి ప్రవాహం

చాగలమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూలో నీటి ప్రవాహం తగ్గింది. వారం రోజుల నుంచి కుందూ నీరు ఆనకట్టపై పొంగి ప్రవహిస్తుండేది. ఎండలు అధికం కావడంతో నీటి మట్టం తగ్గింది. ఆనకట్ట వద్ద ఉన్న గేట్లను మూసి పక్కనే ఉన్న కేసీ ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ఆనకట్ట వద్ద 1,500 క్యూసెక్కుల నీరు నిల్వ ఉందని ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆ నీటి నుంచే కేసీ కాలువకు 300 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు.

రికార్డులు పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

చాగలమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ భూముల రికార్డులను ఉమ్మడి జిల్లాల ఇండస్ట్రియల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ముత్యాలపాడు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో గుర్తించిన 50 ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, సీనియర్ అసిస్టెంట్ దస్తగిరిబాష ఉన్నారు.

చర్యలు తీసుకోండి

డోన్ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ మనోభావాలను కించపరిచేలా ప్రవర్తిస్తున్నటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘం నాయకులు గంగాధర శాస్త్రి, కల్లె శేషావలిశర్మ కోరారు. మంగళవారం స్థానిక అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషాకు, డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌లకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల చికెన్ మేళాకు సంబంధించిన పోస్టర్లలో చికెన్ షాపు యజమాని బ్రాహ్మణులను కించపరిచేలా ఇన్‌స్టాగ్రాం, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టి అవమానించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.